# ప్రజా సంఘాల ఉద్యమానికి స్పందించిన జిల్లా ఎస్పీ

- ప్రజా సంఘాల డిమాండ్లపై చర్యలకు ఎస్పీ హామీ..
- ఆగస్టు 17 ఎస్పీ కార్యాలయం ముట్టడి తాత్కాలిక వాయిదా..





**పూడూర్, ఆగస్టు 15 ( తెలంగాణ దైలి న్యూస్ ) :** వికారాబాద్ జిల్లా పూడూర్ మండలం సోమన్‌గుర్తి గ్రామానికి చెందిన దళిత రైతు జైదుపల్లి నర్సిములు భూమి వివాదంలో న్యాయం చేయాలని, చన్‌గోముల్ ఎస్సై భరత్ కుమార్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాలు చేపట్టిన పోరాటానికి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా స్పందించారు. ఈ నేపథ్యంలో ప్రజా సంఘాల నాయకులను ఆమె చర్చలకు ఆహ్వానించారు. ఈ చర్చల్లో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. వెంకటయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, టిఎస్ఎంఎచ్ పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ వాహబ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తూరు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. ?ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. దళిత రైతు జైదుపల్లి నర్సిములు ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. తన భూమిపై ఆక్రమణ జరుగుతోందని బాధితుడు ఫిర్యాదు చేసినప్పటికీ, ఆయనపైనే తిరిగి కేసు నమోదు చేయడం, భూమి హద్దులను నిర్ధారించేందుకు ఇప్పటి వరకు అధికారిక సర్వే జరగకపోవడం, ఎస్సై భరత్ కుమార్ రెడ్డిపై వచ్చిన ఆరోపణలపై చర్యలు తీసుకోకపోవడం వంటి అంశాలను వివరించారు. ఎస్సై భరత్ కుమార్ రెడ్డిపై వచ్చిన ఆరోపణలపై ఇప్పటికే దర్యాప్తు కొనసాగుతోందని, పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఆరోపణలు నిజమని తేలితే ఖచ్చితంగా శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. అలాగే బాధితుడు జైదుపల్లి నర్సిములు భూమికి సంబంధించి అధికారిక సర్వే పూర్తి చేసి, ఆక్రమణకు గురైనట్లు నిర్ధారణ అయితే ఏఏస్ఈ టైర్స్ కంపెనీపై చట్టప్రకారం కేసు నమోదు చేస్తామని తెలిపారు. బాధితుడి భూమిలో ఉన్న ఫ్రీకాస్ట్ పెన్సింగ్‌ను తొలగించడంతో పాటు, ఆయనపై నమోదు చేసిన తప్పుడు కేసును రద్దు చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. జిల్లా ఎస్పీ స్వయంగా చర్చలకు పిలిచి, ప్రధాన డిమాండ్లపై స్పష్టమైన హామీలు ఇవ్వడంతో ఆగస్టు 17న నిర్వహించాల్సిన జిల్లా ఎస్పీ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రజా సంఘాల నాయకులు ప్రకటించారు. అయితే ఇది పోరాట విరమణ కాదని, హామీల అమలుకు కొంత అవకాశం ఇస్తున్నామని స్పష్టం చేశారు. ఎస్పీ ఇచ్చిన హామీలను స్వాగతిస్తున్నామని, అయితే ఇవి మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో అమలు కావాలని నాయకులు కోరారు. ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి అమలు చేయకపోయినా మళ్లీ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని, వాయిదా వేసిన ఎస్పీ కార్యాలయ ముట్టడితో పాటు ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దళిత రైతు జైదుపల్లి నర్సిములుకు సంపూర్ణ న్యాయం జరిగే వరకు బాధితుడి పక్షాన పోరాటం కొనసాగుతుందని ప్రజా సంఘాల నాయకులు స్పష్టం చేశారు.

## విద్యార్థులకు దుస్తులు బెల్టులు పంపిణీ చేసిన సర్పంచ్ మచ్చేందర్ రెడ్డి



**దోమ, ఆగస్టు 15 ( తెలంగాణ దైలి న్యూస్ ) :** వికారాబాద్ జిల్లా దోమ మండలం రాకొండ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఉచిత పాఠశాల దుస్తులు (యూనిఫామ్‌లు), బెల్టులను పంపిణీ చేసిన బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ మచ్చేందర్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు వీటిని స్వయంగా అందజేశా రు. ఈ సందర్భంగా సర్పంచ్ మచ్చేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించా రు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు. ?పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఉపాధ్యాయులు బోధనతో పాటు విద్యార్థుల సర్వాంగీణ వికాసానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 10వ వార్డులో లో-వోల్టేజ్ సమస్య పరిష్కారానికి చర్యలు



- ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకై స్థల పరిశీలించిన కౌన్సిలర్ రవికుమార్

**పరిగి, ఆగస్టు 15 ( తెలంగాణ దైలి న్యూస్ ) :** పరిగి మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో నిరంతరం వేధిస్తున్న లో-వోల్టేజ్ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభించనుంది. వార్డులో తరచూ విద్యుత్ సరఫరాకు అంతంయం కలుగుతుండటం తో, విద్యుత్ అధికారులతో కలిసి వార్డు కౌన్సిలర్ రవికుమార్,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కొమ్ము చంద్రశేఖర్ గురువారం స్థలాన్ని పరిశీలించారు. సమస్య పరిష్కారంలో భాగంగా వార్డులో కొత్తగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి అనువైన స్థలాన్ని అధికారులు, నాయకులు కలిసి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ... వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న లో-వోల్టేజ్ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలనే ఉద్దేశంతోనే నూతన ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించి, పనులు వేగవంతం చేస్తున్నామని తెలిపారు.

ఈ ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులోకి వస్తే వార్డులో విద్యుత్ సరఫరా సీరుగా ఉండి, ప్రజలకు సమస్యల నుంచి విముక్తి లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక నాయకులు, వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు

# మర్పల్లి బిఆర్ఎస్ లో భారీ చేరికలు

- పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే



**మర్పల్లి, ఆగస్టు 15 ( తెలంగాణ దైలి న్యూస్ ) :** బిఆర్ఎస్ భారీ చేరికలు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే శుక్రవారం వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం పంచలింగాల్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే, మాజీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ మెతుకు ఆనంద్ ఆయన పాల్గొనెందుకు గ్రామానికి చేరుకున్న మెతుకు ఆనంద్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన ఆయన, నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. పార్టీ శ్రేణులకు సమగ్ర దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పంచలింగాల్ గ్రామానికి చెందిన 80 మంది యువకులు వివిధ పార్టీల నుంచి విడనాడి, డాక్టర్ మెతుకు ఆనంద్, సమక్షంలో పెద్ద ఎత్తున బిఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన యువతకు ఆయన గులాబీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీకి నిజమైన బలం, కొండంత అండ మన కార్యకర్తలే. ఈ రోజు పంచలింగాల్ గ్రామంలో యువత చూపుతున్న ఉత్సాహం, వారి మద్దతు చూస్తుంటే బిఆర్ఎస్ సిద్ధాంతాల పట్ల ప్రజలకు ఎంతటి నమ్మకం ఉందో స్పష్టంగా అర్థమవుతోంది. ప్రజల సంక్షేమం కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుంది. యువతతో మాకున్న అనుబంధం అత్యంత బలమైనది. పార్టీపై నమ్మకంతో చేరిన ప్రతి ఒక్క కార్యకర్తను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాం, అందరికీ తగిన గుర్తింపు అందిస్తాం.

రాబో యే రోజుల్లో ప్రతి గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజల తరఫున గొంతుకగా నిలుస్తాం” అని స్పష్టం చేశారు. పంచలి ంగాల్ గ్రామంలో యువత పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ వైపు అడుగులు వేయడంతో గ్రామంలో కొత్త ఉత్సాహం నెలకొంది. పార్టీ బల మైన శ్రేణులతో మరింత పుంజుకుందని స్థాని క నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలు విపరీతంగా పాల్గొన్నారు.

# కుల్కచర్లలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**కుల్కచర్ల, ఆగస్టు 15 ( తెలంగాణ దైలి న్యూస్ ) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు కుల్కచర్ల మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు జి. వెంకటేష్ ఆధ్వర్యంలో “హర్ ఘర్ తిరంగా ర్యాలీ” అత్యంత వైభవంగా, దేశభక్తి నినాదాల మధ్య నిర్వహించబడింది. ఈ యాత్రకు ముఖ్య అతిథులుగా బిజెపి సీనియర్ నాయకుడు, మాజీ జిల్లా కన్వీనర్ కరణం ప్రహ్లాద రావు, బిజెపి రాష్ట్ర నాయకుడు డాక్టర్ వెన్న ఈశ్వరప్ప హాజరై ర్యాలీని ఉత్సాహంగా నడిపించారు. జాతీయతకు, ఆత్మగౌరవానికి నిదర్శనం తిరంగా: డాక్టర్ వెన్న ఈశ్వరప్ప, ఈ సందర్భంగా డాక్టర్ వెన్న ఈశ్వరప్ప మాట్లాడు తూ..తిరంగా కేవలం ఒక వస్త్రం మాత్రమే కాదు; అది మన జాతీయతకు, ఆత్మగౌరవానికి నిదర్శనం. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన ‘హర్ ఘర్ తిరంగా’ ఉద్యమం మన దేశభక్తిని ప్రపంచానికి చాటిచెప్పే గొప్ప అవకాశం. ఒక జెండా ఎగిరితే ఒక ఇల్లు పునీతమవుతుంది, అదే కుల్కచర్లలోని ప్రతి ఇంటిపై జెండా రెపరెపలాడితే అది మన ఐక్యతకు సంకేతం. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ మన ఇళ్లను దేశభక్తికి నిలయాలుగా మారుద్దాం. ప్రతి భారతీయుడు గర్వించేలా ఈ జెండా ఎగరాలి” అని పిలుపునిచ్చారు. పెద్ద ఎత్తున పాల్గొన్న నాయకులు, ప్రజలు, ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకుడు, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు గణపురం వెంకటయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర నాయక్, దిశా కమిటీ సభ్యుడు జానకిరామ్, కుల్కచర్ల గ్రామ సర్పంచ్ వార్యాల అంజిలయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు గాదె మహిపాల్, సీనియర్ నాయకులు చంద్రలింగం, హరికృష్ణ, మల్లేష్, రవీందర్ రెడ్డి, ఉపసర్పంచ్ విజయ్, బిజెపి నాయకులు నరేష్, హనుమంతు, చలివేంద్ర మహేష్, వెంకటేష్, కె. ప్రవీణ్, వివిధ మోర్చాల ప్రతినిధులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కొండంత సమస్యలకు నిలయం కొండాపూర్ జిల్లా దవాఖాన

**కొండాపూర్:** కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామంటుంది ప్రభుత్వం. కానీ కనీస సౌకర్యాలు కూడా కరువయ్యాయని ఆసత్రికి వచ్చే రోగులు, వారి బంధువులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదేదో మారుమూల పల్లె టూర్లో ఉన్న దవాఖాన కాదు. ఇది రాష్ట్ర రాజధాని కొండాపూర్‌లో ఉన్న రంగారెడ్డి జిల్లా ప్రభుత్వ దవాఖాన దుస్థితి. ఆస్పత్రి సమస్యలు విలయతాండవం చేస్తున్నా పట్టించకునేవారే లేరు పేషెంట్లు, కేర్ టేకర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒకటిగా చెప్పుకునే ఈ దవాఖానలో నాలుగు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో రోగులు, వైద్యులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ లేకపోవడంతో అత్యవసర సేవలు సైతం స్తంభించే పరిస్థితి నెలకొంది. ప్రత్యామ్నాయంగా ఉపయోగించాల్సిన జనరేటర్ కూడా పనిచేయడం లేదు. సోలార్ విద్యుత్ ఒక్క రోజు మాత్రమే పనిచేస్తుండటంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. దీంతో కొన్నిచోట్ల టార్చ్‌లైట్లు, సెల్‌ఫోన్ ఫ్లాష్‌ల వెలుగులోనే వైద్యులు అత్యవసర శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు.



**కనీస సౌకర్యాలు నిల్**

విద్యుత్ సమస్యతో పాటు ఆస్పత్రిలో మంచి నీటి కొరత కూడా తీవ్రంగా వేధిస్తోంది. నీటి సరఫరా లేక స్ట్రెచర్లపై (్రాతీవెఎష్ట్రవతీ) టబ్బులు పెట్టి నీటిని తరలిస్తున్న దృశ్యాలు అక్కడి దుస్థితికి అద్దం పడుతున్నాయి. మరోవైపు అవసరమైన మందులు అందుబాటులో లేకపోవడంతో బయట కొనుగోలు చేయాల్సి వస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నా క్షేత్రస్థాయిలో మాత్రం కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేశామని ప్రజాప్రతినిధులు ప్రకటనలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర రాజధానిలోని ప్రధాన జిల్లా దవాఖానలో కనీస సౌకర్యాలు లేకపోవడం శోచనీయమని రోగులు, సహాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాణాలను కాపాడాల్సిన దవాఖాన తీరును పట్టించుకోని అధికారులపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించడం, జనరేటర్ మరమ్మతులు చేపట్టడం, రోగులకు అవసరమైన మందులు, మంచినీటి సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

